# 'మా తెలుగు తల్లికీ...



పి: రాజేంద్ర

జియరామ్ జన్మతః ఆంధ్రుడే. కాని ప్రస్తుతం ప్రవాసాంధ్రుడు.

పుట్టింది విశాఖపట్నంలో. అయితే ఉద్యోగం దొరికింది ఉత్తరప్రదేశ్‌లో కావడంతో ఊరు విడిచి వెళ్లిపోవలసి వచ్చింది. బదిలీల కవకాశం లేని ఉద్యోగం. అందుచేత తన కెంతమాత్రమూ ఇష్టం లేకపోయినా, అభీష్టాన్ని హత్య చేసుకుని, పరిస్థితులకు తలవంచి, ఉద్యోగపు ఊరిలోనే ఇల్లు కట్టుకుని స్థిరపడిపోవలసి వచ్చింది. విధి లేక గడుపుతున్నా డత నక్కడ. ప్రవాసమూ ఒక విధంగా శిక్షే మరి - కొందరికి.

ప్రవాసమంటే -

'తన'ని కా దనిపించే చోట విధిలేక తలదాచుకోవడం. దేశం కాని దేశంలో నివాసం. ఏదో పరాయితనం. అమ్మ నేర్పని భాష. మనసులోకి రాని మనుషులు. బాల్యంలో ఎరుగని పరిసరాలు. అతిథి భావన. అ దొక చెప్పలేని ఆవేదనా, భరించలేని బంగరు సంకెలా. అందులోనూ అతను భావుకుడు.

జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అనే దతని విషయంలో అక్షర సత్యం. అతని కాంధ్రదేశ మంటే అమితాభిమానం. ఉన్న ఊరూ, కన్నవారూ అంటే ఉత్సాహం. బంధువర్గమంటే బహు తీపి. తాను పుట్టిన, బాల్యం, వికసించిన విశాఖపట్నం అంటే వెర్రి.

ఆ ఊరు, ఆ దేశం ... ఆ గాలి ... ఎంత కొట్టుకుపోతుందో అతని మనసు. ఆ తీయని తెనుగు కోసం అతని చెవు లెంత రిక్కించుకుంటాయో!

ఆ గోంగూర పచ్చడి, ఆ ఆవకాయల కోసం ఎలా అర్రులు చాచుకుంటుందో జిహ్వ!

ఆ సముద్రం ... దాని ఒడ్డున ఇసుక ... ఆ కొండలు ... ఆ ఆంధ్ర విశ్వవిద్యాలయం - ఎన్నెన్నిసార్లు హృదయాన్ని తమవైపు లాగేసుకుంటూంటాయో మాటిమాటికీ.

అందుకే - అయిదేళ్లకో, పదేళ్లకో అయినా ఓసారి విశాఖపట్నం వి[వ]చ్చేసి తెలుగు నేల మీద తిరుగాడి వారమో, పదిరోజులో చెల్లెలి దగ్గర ఉండి వెడితే కాని అతనికి తోచదు. మనసు ఊరుకోదు. గుండె గుబులవుతుంది. మనసు బెంగ పెట్టుకుంటుంది. అమ్మకోసం కొడుకు లా దేవేస్తుంది, [బెంగ].


అదీ కాక, తను కిందటిసారి వచ్చి వెళ్లాక చెల్లెలి కిద్దరు పిల్లలు పుట్టారు. ఎంత వద్దామనుకున్నా వచ్చి చూసి వెళ్లడానికి కుదరలేదు. సెలవు దొరకలేదు. మేనల్లుడి పేరు వంశీట. చాలా చురుకైనవాడట! ఎనిమిదేళ్ల వాడై ఉంటాడిప్పటికి. తరువాత తనకు మేనకోడలు పుట్టింది. అనూష! చాలా అందంగా, చలాకీగా ఉంటుందిట. తనకు ఫోటోలు పంపారు కానీ, పిల్లలకి సాటొస్తాయా ఫోటోలు? కళ్లారా చూసి, కానుక లందించాలి. చెల్లెలికి తనంటే ఎంత అభిమానం. బావగారు తన ముందు టెక్కు చేయరు. మంచి ఫ్రెండ్‌లా ఉంటారు తనతో. నాలుగు రోజులు వాళ్లతో గడిపి, గుంటూ రెళ్లి గోంగూర పచ్చడి, బెజవాడలో నక్క దోసావకాయ తిని, కోనసీమ కొబ్బరి నీళ్లు తాగి, అమలాపురం చూసి రావాలి. అప్పటికి కాని మనసు కుదుటపడదు, ప్రాణానికి హాయిగానూ ఉండదు. ఎనిమిదేళ్లయిపోయిం దిటొచ్చి.

తెలియనివారికి - ఇదేమిటి, ఇంత వయసొచ్చి ఇతనికి చిన్న పిల్లల్లా ఈ బెంగేమిటీ? అనిపిస్తుందేమో కాని, తన బాధ వారి కేం తెలుసు? పుట్టి పెరిగిన ఊరుకి వందలకొద్దీ మైళ్ల దూరంలో ఉండటం ఎంత కష్టమని! తెలుగు ముఖాలు కనపడక, తెలుగు భాష వినపడక, తెలుగు తిండి దొరకక, తెలుగు మాట మాట్లాడక,

తెలుగు గాలి వీచక, తెలుగు నేల కానక విదేశీ ఎడారిలో ఒంటరిగా విసిరివేయబడ్డట్టు మనసూ, బతుకూ విలవిలలాడిపోతాయి. గిలగిల కొట్టుకుపోతాయి. జీవితం మీద విసుగూ, వైరాగ్యమూ వచ్చేసి మనిషిని వేదాంతమూ, వైరాగ్యమూ ఆవహించేస్తాయి. ఒక్కసారి తెలుగు గడ్డ మీద కాలూని తన ఊరినీ, తనవారినీ కళ్లారా చూసేసుకుని నోరారా కబుర్లు చెప్పేసుకుని, చెవులారా వినేస్తేనే విముక్తి లభించే దా విసుగుకి. ఆ ఆనందం పంచుకునేందుకు అర్ధాంగికీ, పిల్లలకీ అదృష్టం లేకపోయింది. తీరా తనకు సెలవు చిక్కేటప్పటికి పిల్లలకు పరీక్షలు. పిల్లల కోసం తల్లి. దొరక్క దొరక్క దొరికిన సెలవుని చేజార్చుకోవడం ఇష్టం లేక ఒంటరిగానే బయలుదేరాడు జయరామ్ - మా తెలుగు తల్లికీ మల్లెపూదండా అనుకుంటూ.

రైలు ఆంధ్రదేశం పొలిమేరలలో ప్రవేశిస్తోంది. స్టేషన్‌లో ఆగడమేమిటి - చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం ప్రకటనలోలాంటి ఓ చిరు సంసారం ఎక్కింది పెట్టెలోకి. రైలు డబ్బాలో తెలుగు మాటలూ, వాతావరణమూ మొదలైంది. అదే చిత్రం! రైలు ఏ ప్రాంతం గుండా వెళ్తుంటే పెట్టెలోని ప్రయాణీకు లా ప్రాంతపు భాష, తిండి





మొదలుపెడతారు. రైలు మళ్లీ పరుగందుకుంది. ఓ పావుగంట గడిచిందేమో!

"పప్పీ! నా కేమీ తోచడంలేదు. ఓ పాట పాడవూ!" అడిగాడు తండ్రి.

"డాన్స్ కూడా చెయ్యి!" అంది తల్లి.

ముద్దుగా, మంచి గౌనులో ఉన్న పాప ఆ మాటలకు గౌను విప్పేసింది. ఒక్క అండర్‌వేర్ మాత్రమే ఉంచుకుం దా మూడేళ్లది. చటుకున పాటా, ఆటా అందుకుంది.

"అబ్బ నీ తియ్యనీ దెబ్బ! ఎంత కమ్మగా ఉందిరో రబ్బ!"

అందరి దృష్టీ ఆ పాపమీదే - ఆ పాటకీ, ఆటకీ.

పప్పీ అసలు పే రేమిటో గానీ, పాప భలేగా ఉంది. మూడేళ్ల కుర్రదే అయినా, ఆ పాట పాడటంలోనూ, అభినయించడంలోనూ ఎంత పెద్దరికం! గొంతులోనూ, ఒంటి విరుపులలోనూ, కంటి మెరుపులలోనూ వచ్చి శృంగారం ఒలకబోసేస్తోంది. పిల్ల చిన్నదీ - ఆటా, మాటా, పాటా పెద్దవి. అభినయం అతి. ఆ పాటలోని మాటల కర్థం కాని, భావం కానీ తెలుసుకోగలిగినా, ఆ శరీరపు కదలికలలోని వాంఛితం గ్రహించగలిగినా, అలాగ ఆమె పాడనూ పాడజాలదు, ఆడదూ ఆడజాలదేమో!

అర్థం తెలియకుండా చేసే అంధానుకరణ. అందుకే నీతి తప్పిన బూతు పాటా, కోతి ఆటా. మూడేళ్ల పాప ఇరవయ్యేళ్ల దానిలా శృంగార అశ్లీలాలు కురిపించడం!

కళ్లు మూసుకున్నాడు చూడలేక. చెవులు మూసుకున్నాడు వినలేక.

"భలేగా ఉంది పాప!"

"ఎంచక్కా పాడిందో! అచ్చం రికార్డులోలాగే!"

"ఎంత బాగా డాన్స్ చేసిందీ సినిమాలోమల్లే!"

"ఇలా ప్రాక్టీస్ చేస్తే సినిమాల్లో చేరొచ్చు!"

"ఇప్పుడే బేబీ తారగా చేరిపోతే, ఆనక హీరోయి. నవ్వొచ్చు!"

"సినిమా వా ళ్లి డాన్సు చూసి పాట విన్నారో, పట్టుకుపోయారే పాపని!"

ఆ దంపతులు ముసిముసిగా నవ్వారు.

"పాపను సినిమాల్లో చేర్పించేందుకు ప్రయత్నించడానికే మద్రాసు తీసుకెళ్తున్నాం!"

'శివ శివా!' అనుకున్నాడు జయరామ్.

కానీ, పెట్టెలో అందరూ ఆ పాపనీ, తల్లిదండ్రులనీ అభినందించేవారే! అందలమెక్కించేవారే!

"మీ పాపకి సినిమా ఛాన్సొస్తే మీ జన్మ ధన్యమే!"

"పూర్వ జన్మలో ఎంత పుణ్యం చేసుకున్నారో ఇలాంటి సినిమా పాపను కనడానికి!"

అభినందన, వరంపరలు.

"ఏదీ ... మరో పాట?"

కా దనకుండా పాటా, ఆటా ఎత్తుకుంది పాప. సాహిత్యపరంగానూ, శృంగారపరంగానూ మొదటిపాటకంటే మరీ అసహ్యంగా ఉం దిది.

ఇవి సినిమా పాటలే? వదిమందిలోనూ పాడదగినవేనా! ఏ సానిమేళాల్లోనో తప్ప? తెలుగు సినిమా ఇంత దిగజారిపోయాయా! పదేళ్లలో ముసు పింత అధ్వాన్నమూ, అసహ్యమూ కావే!

ఆ పాటలు వినలేక ఎవరి దగ్గరో తెలుగు పత్రికుంటే తీసుకున్నాడు - చదువుకుంటూ బూతు పాటల భాగోతం తప్పించుకోవచ్చు నని. యధాలాపంగా పుస్తకంలో ఏదో పేజీ తెరిచేసరికి :

" 'పెళ్లి నీకు - శోభనం నాకు.'

'ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్' శతదినోత్సవ సభలో 'ముగ్గురు మొగుళ్ల ముద్దుల ముండ', మరియు 'బూతు బావా కోతి మరదలూ!' సినిమాలను తమ తదుపరి నిర్మాణాలుగా పేర్కొన్నారు.

''రాత్రికి రా' దర్శకుని మలి చిత్రం - 'మంచమెక్కు మామా!ట!

''గాజులు తొడగనీ మోజులు తీరనీ!' అర్ధ శతదినోత్సవం వైపు వరుగులు! మహిళలను విశేషంగా ఆకర్షించుకునే చిత్రం - 'చీర విప్పి చూడు!'.''

ఆ విశేషాలు చదివేసరికి వాంతి వస్తున్నట్లయి పుస్తకం పావను ఇచ్చేసి బాత్‌రూమ్‌కి పరుగెత్తాడు జయరామ్ - భరించలేక.

ఇవన్నీ సినిమా పేర్లా! పూర్వకాలపు బూతు పత్రికల కథల శీర్షికలు కూడా ఇంత బరితెగించి, లేవే! ఇంత దిగజారిపోయిందా తెలుగు సినిమా రంగం! ఇటాలియనాఫ్ ద ఈస్ట్! తీయని తెనుగుకి ఇంత భావ దారిద్ర్యమూ, నామ దారిద్ర్యమూ ఎప్పుడొచ్చి పడ్డాయి? ఇంతకంటే తన రాష్ట్రపు సినిమాల పేర్లే నయం!

విజయవాడలో సినిమా పావ కుటుంబం దిగిపోయింది. పదిమంది కుర్రాళ్లెక్కారు. కుర్రాళ్లూ విద్యావంతులూ కదా! ఏ రాజకీయాలో, సామాన్య విషయాలో చర్చించుకుంటారూ తనకీ కాలక్షేప మవుతుందని ఆశించిన జయరామ్‌కి నిరాశనే ఎదురు చేశారు వారు.

తమ అభిమాన నటులను కీర్తిస్తూనూ, వారి సినిమాలను తలుచుకుంటూ పరవశించిపోతూనూ, చినికి చినికి గాలివాన అయినట్లు వారి అభిమానాలు కాస్తా నిముషాలలో దురభిమానాలై ఒకరినొకరు తిట్టుకుంటూ కొట్టుకునే స్థాయికి వచ్చేశారు. వాళ్లంతా ఏలూరు నుంచి విజయవాడకు సినిమాలు చూడట మనే పనిమీద మాత్రమే వచ్చిన విద్యార్థులట! వారి వైఖరికి జాలీ వేసింది, తలనొప్పీ వచ్చింది.

రేపటి పౌరులు! తెరమీద నీడల గురించి తగవు లాడుకున్నారు - స్నేహం కూడా మరచి.

తాడేపల్లి గూడెంలో ఎడమొహం పెడమొహంగా దిగి వెళ్లారు వారు.

ఆలస్యంగా నడచిన రైలు విశాఖపట్నం చేరేసరికి అపరాహ్ణ మయింది. రైలు దిగి ఆటో ఎక్కిన జయరామ్, సోడా కొట్టు ముందు ఆటోను ఆపించి, సోడా కొట్టమన్నాడు.

''బిస్లరీయా!''

## అంబాసిడర్

ఇస్లామాబాద్‌లో భారత రాయబారిగా పని చేసిన ఎస్.కె. సింగ్ అనే ఆయన స్నేహితుని ఇంటికి వెళ్లారు ఒకసారి. ఆ స్నేహితునికి కాన్వెంటులో చదివుతున్న ఆరేళ్ల పావ ఉంది. సింగ్ గారు సరదాగా ఆ పావతో సంభాషణ మొదలు పెట్టారు. ఆ పాప ఏం చదువుతున్నదీ, ఏ కాన్వెంటులో చదువుతున్నదీ, ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం మొదలైన ప్రశ్నలు వేశారు. పావ ఓపిగ్గా సమాధానాలు చెప్పి ''అంకుల్, మీరేం చేస్తుంటారు?'' అని ప్రశ్నించింది. ''నేనా నేను ''అంబాసిడర్''గా పనిచేస్తున్నాను పాపా! మరి అంబాసిడర్ అంటే ఏమిటో తెలుసా?'' అన్నారు. ''ఓ తెలుసు! మా నాన్నగారికి ఒకటి ఉందిగా'' అంది పావ అమాయకంగా.

[ఈదుపల్లి వెంకటేశ్వర రావు]
[ఏలూరు]


''ఊహుఁ! గోలీ సోడా! బాగా కీచు మనాలి!'' అన్నాడు జయరామ్ ఆత్రంగానూ, ఆనందంగానూ. సోడా సోడా ఆంధ్ర సోడా! గోలీ సోడా ఆంధ్రాకే ప్రత్యేకం - గోంగూర పచ్చడిలాగానే. పేదవాడికి కూడా అందుబాటులో ఉండే తక్కువ ధర. కళ్లద్దాల కుపమానమైన గోలీ సోడా! అచ్చం తెలుగు సోడా తాగి మళ్లీ ఆటో ఎక్కాడు. అది లవండర్ కెనాల్ మీదుగా పరుగెత్తుతుంటే నవ్వుకున్నా డతను.

ఆంధ్రులైన విశాఖ వాను లెంత హాస్యప్రియులు! రసనులు! కంపు కొట్టే మురికి కాలువకు కూడా ముద్దుగా, అందంగా లవెండర్ కెనాల్ అని పేరు పెట్టుకున్నారు.

''ఒక్క నిముషం ... టీ తాగేసొచ్చేస్తాను. ఏమనుకోకండి!'' అన్నాడు ఆటోవాడు.

''భలేవాడివే! దాన్దేముంది?''

''మీరు సిరంజి అంత మంచివారు సారూ!'' అని వెళ్లాడు వాడు.




జయరామ్ తెల్లబోయాడు. పోలికకి కూడా సినిమా తారలు తప్ప మరెవరూ దొరకలేదా? సజీవుడైన తనను, నిజం మనిషిని ... వెండి తెరమీద వెలుగునీడలతో పోల్చడం! నవ్వాలా, ఏడవాలా?

జయరామ్ చెల్లెలి ఇల్లు చేరేసరికి వాళ్లు హడావుడిగా ఉన్నారు.

''ఏమైందమ్మా?''

''నువ్వు తొందరగా భోజనం కానిచ్చేస్తే ...''

''ఎందుకూ తొందర?''

''నా అభిమాన నటి సినిమా రిలీజయిం దివాళ. చచ్చీ చెడీ టిక్కెట్స్ తెప్పించుకున్నాను. మీ బావగా రర్జెంటు పనుం దని వెళ్లిపోయారు. మ నిద్దరమూ వెళ్లాం. నమయాని కొచ్చావు!''

''పిల్ల లేరీ?''

''తొందరగా భోజనం చెయ్యి! హాలులో మాట్లాడుకోవచ్చు. టైమైపోతోంది!''

హడావుడిలో ఆమె ఏం వడ్డించిందో, త నేం తిన్నాడో! నిజాని కతనికి బడలికగా, నిద్రగా ఉంది. రేజుల తరబడి రైలు ప్రయాణమాయె! కానీ, చెల్లెలి మాట కాదనలేక సినిమాకి బయలుదేరాడు - థియేటర్‌లో నిద్రపోవచ్చులే అనుకుంటూ.

డైలాగులకు కూడా స్టీరియో. పాటలు చెవులు బద్దలుకొట్టేస్తూ రేకళ్ల / ఫైటింగుల శబ్దాలు గుండెల మీద గుద్దుతూ, కేకల పాటలు కన్ను ముయ్యనివ్వ లేదా కర్ణకఠోర గందరగోళం సినిమా! గోల సినిమా! గగ్గోలు సినిమా!

ఆ డిస్కో లైటింగులకు కళ్లుమంటలు, ఆ స్టీరియో సౌండ్‌లకు చెవులపోటు, తలనొప్పి! ఎలాగో ప్రాణాలు మిగుల్చుకున్నా డా సినీ నరకం అనుభవించినా. గండం గడిచిందీ, ఇంటికిపోయి పడుకోవచ్చు నన్న ఆనందంతో ఆటో ఎక్కి ఇల్లు చేరుకున్నాడు చెల్లెలితో. తోవంతా తినేస్తూనే ఉంది - ''సినిమా చాలా బాగుంది కదూ, అన్నయ్యా!'' అంటూ.

''ఊఁ'' అనక తప్పలేదు. ప్రయోజనం ఉండనప్పుడు అప్రియ మెందుకు పలకాలని. కానీ ఈ అర్థం లేని సినిమాను కూడా అంతగా మెచ్చేసుకుంటున్న చెల్లెలి మీద జాలి వేసింది. ఈమె అభిరుచులు ఎంత దిగజారిపోయాయి అప్పటికీ, ఇప్పటికీ!

ఇంటి కొచ్చారు.

''వంశీ, నీ మేనల్లుడు! అనూప - నీ మేనకోడలు!''

''మీ మామయ్య!''

''నమస్తే అంకుల్!'', నమస్తే, అంకుల్!'' వాళ్లు ముద్దుగా, ముచ్చటగా అన్నారు.

''మీ రెక్కడికి వెళ్లివస్తున్నారు మమ్మీ?''

''సినిమాకి.

''ఓ! అంకుల్! మమ్మీని పిక్చర్‌కి తీసుకెళ్లావా! మరి నన్నో? నా ఫేవరేట్ బేబీ పిక్చరొచ్చింది పద!'' చెయ్యి పట్టుకుని లాగింది అనూప.

''ఏం కాదు, నా హీరో పిక్చర్‌కే వెళ్లాం, అంకుల్! ఫైటింగ్స్, స్లెప్స్, రౌడీ రాస్కెలని - భలేగా ఉంటుంది. సోడా బుడ్లు, సైకిల్ ఛెయిన్ ఫైటింగులు స్పెషల్ ఎట్రాక్షనట! ప్లీజ్, కమా

నంకుల్!" వా డొక చెయ్యి పట్టుకుని లాగసాగాడు.

జయరామ్‌కి మతిపోతోంది మధ్య. పిల్లల మాటలలో ఎక్కువ ఆంగ్లమూ, అతి తక్కువ తెలుగూ! ఎంత కాన్వెంట్ చదువులైనా - వీళ్లు ఇంగ్లీషు పిల్లలా? తెలుగు పిల్లలా? తెలుగు మాత్రం నేర్పడంలేదు బళ్లో. ఇదే తమిళ దేశంలో అయితే ... హిందీ దేశంలో అయితే ... ఇంట్లో ఇలా పరాయిభాష వినపడనిచ్చేవారా? తెలుగుకే ఎందు కీ దుర్గతీ, తెగులూ? మాతృమూర్తిని మాతృభాషని ఎందుకు మరచిపోవాలి?

బావగారు ఎప్పుడు వచ్చి తన వెనుక నిలబడ్డారో గమనించనేలేదు ఇద్దరు పిల్లల మధ్యా చిక్కుకుని.

"నీ యెంకమ్మ! ఉండరా! అంకుల్‌ని నే నడుగుతుంటే ను వ్వేమిటి మధ్యలో? దెబ్బ కొట్టానంటే దిమ్మ తిరిగిపోద్ది!"

తుళ్లి పడ్డాడు. అనూష నోట ఎటువంటి భాష. ఆవేశం ఆపుకోలేక కసిరాడు.

"అనూషా! ఏమి టా బూతు మాటలు?"

"బూతు మాటలా? కా దంకుల్! సినిమాలోవి."

"ఎక్కడివయినా బూతుమాటలే!"

"వెంకమ్మకి జీవ భాషా పదం యెంకమ్మ. అందులో త ప్పేముందీ? వెంకమ్మ ..." కలుగజేసుకున్నారు బావగారు.

అప్పుడు చూశా డాయన్ని.

"నమస్కారం! తెలుగు దేశంలో ఉండడంలేని నేను, మీకు తెలుగు గురించి చెప్పవలసి రావడం తెగ చింతించవలసిన విషయమే. వాక్యాన్ని ముక్కలు చేయగా వచ్చే ఒక పదం, లేదా పదంలోని అక్షరం - వీటిలో బూతు కనపడకపోవచ్చు. అంతమాత్రాన వాక్యమూ, సందర్భమూ బూతు కానట్లవదు. మీరు బూతు మాట అని అంగీకరించే పదంలోని అక్షరాలనే ఒక్కొక్కటిగా, విడిగా చూడండి! పూ అనే అక్షరం 'పూజ' లాంటి పవిత్ర పదంలోనూ ఉంది; వచ్చి బూతుమాటలోనూ ఉంది. కుసుమం మాటలో తప్పేమీ లేదు. దానిలో అక్షరాలు దేని కది ఏమీ కావు. బూతు అక్షరాలలో ఉండదు. త ప్పేమీ లేదు. వాటి నమర్చి చేసే పదాలలోనే, ఆ పదాల అమరికలోనే ఉత్పన్నమవుతుంది. అక్షరా లన్నీ అతి పవిత్రాలే! బూతు మనసులూ, మనుషులూ బూతు పదా లేర్పరుస్తారు!"

"మరి సినిమాలోనే వాడారుగా?"


"విన్నన్న చెప్పిందే వేదమా! సినిమా అంతే! చూడబోతే ఏ డెనిమిదేళ్లలోనూ చాలా జారిపోయినట్లుందే తెలుగు సీమ!" నవ్వాడు జయరామ్ బలవంతంగా.

"ఏమేవ్! చించేగల్ను! బద్దలుకొట్టేగల్ను!" అన్న చెల్లెలి మీద ఆ ప్రయోగాలు!

"పోరా పోటుగాడా! కొజ్జాగాడా! ఇరిగిపోద్ది జాగర్త!" చెల్లెలి జవాబు!

ఆ మాటలు వినేసరికి చేదు మింగినట్లే అయిపోయాడు జయరామ్. ఒట్టి చేదు కాదు, కాకరకాయలా, వేప చిగురులా ఒంటికి మంచి చేసే చేదు కాదు - కాలకూట విషమూ, కటిక గరళమూ మింగుతున్నట్లే అయింది.

"నోర్ముయ్యిం డిద్దరూ! ఏమి టా వెధవ



మాటలు? వాటి అర్థం తెలుసా?" కోపం పట్టలేకపోయాడు.

"త ప్పేమిటి అంకుల్? సినిమాలో ఇలాగే మాట్లాడుతా రుగా?"

జయరామ్‌కి ఏడుపొచ్చినంత పనయింది. మాటి మాటికీ సినిమా. మాటమాటకీ సినిమా! ఒకప్పుడు లేబరు భాషనుకునేదే ఇప్పటి అందరి భాషా! తెలుగు జీవితమూ, మాటా, పాటా, ఆటా - అన్నీ తెలుగు సినిమా వేలుపుకి హారతైపోయాయా? సుమతీ శతకం పోయి సినిమా శతకం; నీతి చంద్రిక అంతరించి సినీతి చంద్రిక- ఆ సినిమాల్లో నేమో నేతీ బీరకాయలలో నెయ్యంత మాత్రం తెలుగుతనమూ, తేటదనమూ! చెల్లి అన్నను .... 'కొడుకా అనేస్తుం దవలీలగా! అన్న చెల్లెల్ని నియమ్మ అంటాడు అలవోకగా! అజ్ఞానమా? అర్థం తెలియని అమాయకపు అనుకరణా? ఏమన్నా అంటే - సినిమాల్లో అంతే! అంటారు

పెద్దా చిన్నా ఏకకంఠంతో - ఒకరి కొకరు వంత పాడుతూ. ఆంధ్రదేశ వాసులకు సినిమాయే తప్ప సొంత భాషా, స్వంత ఆలోచనలూ, స్వతంత్రమైన జీవితమూ మిగలలేదా? ఇంత దిగజారుడా తెలుగుదేశానికి! అప్పటికీ ఇప్పటికీ ... ఇంతలోనే ఇంత తెరజారుడా?

"చెప్పంకుల్! సినిమాకి పట్టుకెళ్తావా, ఎల్లవా?"

ఆ భాషను పెద్దవాళ్లు కూడా సరిదిద్దడంలేదు.

"అంకుల్ అని కాక, మామయ్యా అంటే, రేపు తీసుకెళ్తాను."

"అంకులంటే ఏటి రాంగు? దొబ్బకంకుల్!"


చెవులు మూసుకోబోయేంతలో, బావగారి గునగునలు - "ముద్దుల మొగాడు కేసెట్ తెచ్చాను. పేరుకి తెలుగు సినిమా కాని, పక్కా బ్లూ! పైగా, బ్రమ్మాండమైన వచ్చి బూతులు. భలే ఉషారుగా ఉంటుందిలే! పిల్లల బారి నుంచి ఎలాగో తప్పించుకో! సెక్స్యు ఎడ్యుకేషన్ అనుకో!" - ఊరింపు, ఉవ్విళ్లూరింపు.

"స్నానం చేసి, భోజనం చేశాక నిద్ర రాకపోతేను!" అన్నాడు జయరాం.

"ఇవాళ తెలుగు సినిమా ఉందిస్మీ టీ.వీ.లో! వేళయిపోతోందనే వంట తేలిగ్గా చేసేస్తున్నాను. చారూ, మజ్జిగా చాలు కదా!"

నలభై ఎనిమిది గంటల రైలు ప్రయాణంతో చచ్చీ చెడీ ఉంటే సినిమాకు తీసుకుపోయింది వీధిలోనుంచే. అది చాలనట్లు మళ్లీ ఇప్పు డీ అగ్ని పరీక్ష! సినిమాయే సకల విందులూ సర్వ సత్కారాలూ కాబోలు! చెల్లెలు కూడా చాలానే చెడిపోయింది. మొహమాట పడితే లాభం లేదనుకుని, "స్నానానికి వేణ్ణీళ్లు పెడితే ... అసలే రైలు ప్రయాణం, ఆ పైన సినిమా... "నసిగాడు.

"టీ.వీ. సినిమా వచ్చేస్తుం దిప్పుడు వేణ్ణీళ్లని కూర్చుంటే! ఆ సినిమా టైటిల్సు దగ్గరనుంచీ చూడదగ్గది. ఈ పూటకి చన్నీళ్లతో సరిపెట్టుకోలేవూ! స్టౌ మీద ఒకేపు అన్నమూ, మరో వైపు చారూ - అందుకని ..." నొచ్చుకుంది.



స్నానం, భోజనం, నిద్ర - అన్నిటికీ బదులు సినిమా విందేలా ఉంది తన మొఖానికి. ఇక్కడికి వచ్చే ముందు తను నాలుగైనా తెలుగు సినిమాలు చూసి వెళ్లా మనుకున్నాడు - అక్కడ వేయరు కదా అని. కాని, అన్నప్రాశన నాడే ఆవకాయన్నట్లు - అడుగు పెట్టకుండానే ఆ 'మొండి - శిఖండి' సినిమా చూడవలసి వచ్చింది. బహు భయంకర సినిమా! నిత్యమూ ఇలాంటి తెలుగుతనమే లేని చిత్రరాజాల మధ్య ఉండి కూడా వీళ్ల కింత వా పేమిటో! తిన్నమ్మకి తిన్నకొద్దీ వాపే, కన్నమ్మకి కన్నకొద్దీ వాపే అని ఇందుకే అంటారేమో! మెతుకు పట్టుకుంటే అన్నమంతా ఉడికిందో, లేదో తెలియదూ! ఆ సినిమా చాలదూ - తెలుగు సినిమా లెంత ఘనంగా వడిపోతున్నాయో ఊహించేందుకు? వీటికంటే ఆ హిందీ సినిమాలే నయం!

కుర్చీలో కూర్చునే కునికి పాట్లు పడుతున్న జయరామ్, ఒక్కసారి భూకంపం వచ్చినట్లు తుళ్లి పడ్డాడు. ఉన్నట్లుండి పెద్ద శబ్దం. స్టీరియో ... మైకు....

ఎవరో చెప్పారు - "బంగారు కోడి పెట్ట వొచ్చెనమ్మో! వరుసలో ఇప్పుడు అయ్యప్పస్వామిపై పాట!"

పాట భజన పాట - "బంగారు స్వామి అయ్యప్ప ... స్వామి శరణం. అయ్యప్ప ... అయ్యప్ప ... అయ్యప్పప్పా ..." డిస్కో మ్యూజిక్. భక్తి పాటకు బూతు వరుస!

ఆ విపరీత ధ్వనులు - చెముడొచ్చేస్తుందేమో అని భయమేసింది.

అఖరికి అయ్యప్పస్వామిలాంటి దేవుడ్ని కూడా చవకబారు సినిమా పాటలకు తుంగతొక్కేస్తున్న తెలుగువారు మహా గొప్పవారు! ఆ పాట వరస, హోరు మ్యూజిక్, చెవులు చిల్లులుపడే శబ్దాలూ ... భగవంతుడా! నీ పట్ల భక్తేనా ఈ అరుపులూ, ధ్వని కరువులూ! వీళ్ల చెంపలు పగలుగొట్టక నోరుమూయించక ఊరుకుంటా వేం?

తలుపు మూసి చెవుల్లో వేళ్లు పెట్టుకున్నాడు. నిద్రతో కళ్లు కూరుకుపోతున్నాయి. కన్ను మూత పడుతుంటే -

"పెట్టనా? ముద్దు పెట్టనా?" ఆడ కంఠం - కవ్వింపుగా.

"కొట్టనా? దెబ్బ కొట్టనా?" మగ కంఠం - రెచ్చగొడుతూ.

"పెడుతుంటే హాయి హాయి! కొడుతుంటే కంయి కంయి!" జంట స్వరాలు.

అనూషా, వంశీ ఆడేస్తున్నారు, డా న్సాడేస్తున్నారు! పాడేస్తున్నారు పాట పాడేస్తున్నారు!

"చూశావా అన్నయ్యా! కొట్లాడుకున్నప్పుడు కొట్లాడుకున్నా ఉత్తప్పుడు అచ్చం సినిమాల్లో అన్నా చెల్లెళ్లలా ఎంత అనురాగంగా ఉంటారో వంశీ, అనూషా! ఆ స్టెప్పులూ, మూమెంట్లూ, డాన్సూ, పోజులూ, పాటా - అచ్చంగా హీరో హీరోయిన్లే!" ఆమె కంఠంలో గర్వం!

దేవుడా! అని తలపట్టుకున్నాడు జయరామ్. చిన్నపిల్లలైపోబట్టి కాని, ఆ ఆటా, పాటా, అశ్లీలమూ చూసి అన్నా చెల్లెళ్లనుకునేటట్లున్నారా వాళ్లు? ఆ ముద్దులూ, కౌగిలింతలూ, ఒంటి విరుపులూ, కంటి మెరుపులూ - ఎంత అసహ్యంగా అసభ్యంగా ఉన్నాయి! మరి చెల్లెలలా అంటుందేం? పొంగిపోతుం దేం? సినిమా గొంగట్లో బతుకుని తింటూ వెంట్రుక లేరుకోవడం మానేసిందా? మరచిపోయిందా? నలుగురితోపాటు నారాయణా అనుకుందా!

పాట మార్చారు వాళ్లు.

"నా అప్పడాల కర్ర ..."

"నా ఆవకాయ బద్ద ..." కొత్త పాటెత్తుకున్నారు.

జయరామ్ భరించలేకపోయా డా భంగిమలనూ, పాటనూ.

"షటప్! నోర్మూసుకోండి! పొండి!" అరిచాడు పట్టలేని ఆవేశంతోనూ, ఆగ్రహంతోనూ.

పిల్లలే కాదు, పెద్దలూ ముఖం ముడుచుకున్నారు. వింతగానూ కొంచెం దెబ్బతిన్నట్లుగానూ.

"సారీ! సినిమాలే తప్ప ఇంకేమీ ఎరుగని మీకు తోచని అసభ్యత నాకు తోచి, కసిరాను!" అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు చింతిస్తూ.

నగం నిద్రా, నగం మెలకువలోనే అతడు స్నానమూ, భోజనమూ నటించాడు.

డ్రాయింగ్ రూమ్‌లో తన పడక. టీ.వీ. కూడా అక్కడే మరి. అతిథి కదా!

నిద్రతో కూరుకుపోతున్నాయి కళ్లు. పక్కనే టీ.వీ. దాని మీద తెలుగు సినిమా. దానిలో నుంచి పెద్ద గోల! అయినా నిద్ర సుఖ మెరుగదు కనుక అలాగే నిద్రపట్టేసింది. అతని పరిస్థితటువంటిది. ఒళ్లెరక్కుండా పడి నిద్రపోతున్నాడు - పక్కనే తెలుగు సినిమా అవుతున్నా.

మెలకువ వచ్చేసరికి ఎనిమిదీ, ఎర్రగా సూర్యుడూను.

"ఇవాళ టీ.వీ.లో ప్రాంతీయ చలన చిత్రం కూడా తెలుగుదే!"

"హాయ్ హాయ్! రెండు చూడొచ్చన్నమాట!"

"భలే!"

"అంతవరకూ నా హీరో పిక్చరు చూడొచ్చు కేసెట్ వేసుకుని."

"నా హీరోయిన్ పిక్చరయితే భలే భలే పాటలు!"

"దెబ్బలాడుకోకండి రెండూ వేసుకుందురుగాని!"

రానున్న ఆపద ముందే తెలిసిపోవడంతో గబగబా కాల కృత్యాలు తీర్చుకుని ఇంటి నుంచి బయటపడ్డాడు తరిమినట్లు.

ఓ ఆటోను కుదుర్చుకుని, "ఊరంత తిప్పాలి! మరీ స్పీడుగా పోకూడదు. నేను ఊరు చూడాలి. అందుకు!" అంటూ ఎక్కి కూర్చున్నాడు. ఆటో పరుగెత్తసాగింది.

ఊరు చాలా మారిపోయింది. అప్పటికీ ఇప్పటికీ పోలికలే లేవు. ఉక్కు నగరం అయిపోయింది. ఎటు చూసినా సినిమా హోర్డింగులు, ఏ గోడ చూసినా సినిమా పోస్టర్లు, ఏ వీధిన వెళ్లినా సినిమా పాటలు.

అతని కాశ్చర్యం వేస్తోంది. ఇక్కడి ప్రజల జీవితా నికి సినిమా తప్ప మ రేమీ లేదా? అప్పుడూ ఉండేది వెర్రి, కాని వేపకాయంత. ఆ వెర్రి ముదిరి పుచ్చకాయంత పిచ్చి అయినట్లయింది. లేకపోతే ఇం కేమీ పనీ, వినోదమూ లేనట్లు మ్యాటినీ టికెట్లకూ, రాత్రి ఆటల టికెట్లకూ అడ్వాన్స్ బుకింగ్ కోసం అంతంత క్యూ లేమిటీ ఇంత ఎండలో? నలుగురు కలిస్తే చాలు సినిమా కబుర్లు. ఆ సినిమా చూశావా? అంటూ కుశల ప్రశ్నలు. ఫలానా సినిమా చూడు అంటూ సలహాలు. గాలినిండా సినిమా మాటలూ, పాటలూ, నేల నిండా సినిమా అడుగులు, ఊరు సర్వం సినిమా మయం! ఈ ఊరు ... ఈ నేల ... ఈ గాలి ... ఈ నీరు ... సినీ కాలుష్యంతో లుకలుకలాడిపోతోంది.


మినర్వా బీచ్, రామకృష్ణా మిషన్, సెంచరీ క్లబ్, సిరిపురం, ఆంధ్రా యూనివర్సిటీ, ఎల్లమ్మతోట, అల్లిపురం, చావులమదుం తిరిగి ఇల్లు చేరేసరికి ఇంటిల్లిపాదీ టీ.వీ. ముందు కూర్చుని సీరియస్‌గా సినిమా చూసేస్తున్నారు.

అతన్ని పట్టించుకునే దృష్టి ఎవరికి లేకపోయింది. అయితే అతను చింతించలేదు.

ఎలాగూ అటెళ్లాను కదా అని చెంగల్రావ్‌పేటలోని పాత మిత్రుడి పద్దకు వెళ్లి, "నిన్న వచ్చా" నని చెబితే, అతను వేసిన మొట్టమొదటి ప్రశ్న - "నిన్నే వచ్చేవా? ఐతే రాత్రే సినిమా చూశావ్?"

యాభై దాటుతున్న అతని ప్రశ్నకు ఒళ్లు మండి, "శాకినీ ఢాకినీ చూశాను. ఇప్పుడు పదకొండు గంటల ఆట - నీ భార్యే నా ప్రియురాలుకి వెళ్తున్నాను, టైమయిపోతోంది" అని, కాఫీ అయినా తాగకుండా వచ్చేశాడు - వెంటనే లేచిపోయి. అంత పెద్దవాడికీ అంత సినిమా వ్యామోహం వచ్చేయ్యగా వీళ్లెంత?

అంతా ఇంతే! ఆంధ్ర దేశంలో సినిమా వినోదంగా కాక, జీవితమే అయిపోయిం దందరికీ! ఈ విషయంలో పల్లెటూళ్లూ పట్నాలకు



### అతి పెద్ద మొత్తాలు

ప్రపంచం మొత్తం మీద అతి ఎక్కువ న్యూస్ పేపర్ ఎడ్వర్టయిజ్‌మెంట్ రేటు తీసుకొనేది ఓ మియూరి షింబున్ [జపాన్]. ఉదయపు ప్రచురణలో ఫుల్ పేజీకి 39,21,000 రూపాయలు. సాయంత్రం ప్రచురణకు 32, 20,000 రూపాయలు. ఈ పత్రిక సర్క్యులేషన్ 4,42,47,132.

అతి పెద్ద ఏడ్ ఏజెన్సీ సబి అండ్ సబి [లండన్]. సంవత్సరాదాయం 13,200 కోట్లు.

*సేకరణ: పుత్తూరు ఉమ [బళ్లారి]*

పెద్దతమ్ముళ్లే. సిరబ్బదుకానీ సినిమా చీడ అంటకుండా ఉంటుందా?

"ఎక్కడికీ ప్రయాణం?" ఆశ్చర్యపోయింది చెల్లెలు.

"మా ఊరే!"

"అ దేమిటీ? వచ్చి ఓ రోజైనా కాలేదు!"

జయరామ్ ఏమీ అనలేదు.

"నాల్రోజు లుండి నాలుగు సినిమాల్లు చూసి మరీ వెళ్తావనుకున్నాం!"

ఇక అక్కడ మరో క్షణ ముండకుండా స్టేషన్ కొచ్చేశాడు. అదృష్టం బాగుండి వెంటనే రైలూ, రిజర్వేషనూ కూడా దొరికాయి. రైలు కదలనూ కదిలింది.

రైలు ఆంధ్రదేశవు పొలిమేరలు దాటిపోతుంటే - "గుడ్‌బై తెలుగు తల్లీ! గుడ్ బై! నే నిక మళ్లీ రాలేను నీకోసం. రాబుద్ధి కాదు. పేరుకి మిగిలింది తెలుగు సీమ తప్ప, తెలుగుతన మెక్కడుం దిప్పుడు? ఆంగ్లతనమూ, హిందీతనమూ - అంతే! తెలుగుదనం వలసపోయింది. ఎక్కడికో ప్రవాసం పోయింది ఆంధ్ర దేశం వదిలి - సినిమాలే తరిమేసి ఉంటాయి తెలుగును తెలుగు నేల నుంచి. ఈ మనుమలు ... తెలుగు మనుమలు ... సినిమా మాటలే ఆడుకుంటూ, సినిమా పాటలే పాడుకుంటూ సినిమాల చుట్టూనే తిరుగుతూ, సినిమాలే తింటూ, వింటూ, కంటూ, సినిమాలే పీలుస్తూ ... తాగుతూ ... సినిమా పిల్లల్నే కంటూ భ్రమాజనిత ప్రపంచంలో బొమ్మలైపోయారని తెలియక దూరవు కొండలు నునువుగా కనిపించి ...

మా తెలుగు తల్లికీ మల్లెపూదండ అంటూ పాడుకుంటూ వచ్చాను ఇరవైనాలు గ్గంటల కిందట - అమాయకంగానూ, తెలుగు మీది ఆశతోనూ, దాహంతోనూ.

"కాని, ఇక్కడ తెలుగుతనమే కానరాలేదు. మంచినీళ్లు కావాలా అని అడగకుండా, ఏం సినిమా చూశా వని మర్యాద మొదలుపెట్టే కొత్త - సినిమా సంస్కృతీ సంప్రదాయమూ వచ్చిపడ్డాయి. ఫాస్ట్ ఫుడ్సే తప్ప పాయసమూ, పులిహోరా కానరావు.

పెద్దవాళ్లకే సినిమా తప్ప జీవితమూ, వాస్తవికతా లేకపోతూంటే, ఆ సినిమాలమ్మలకీ, చలనచిత్ర తండ్రులకీ సినిమా పిల్లలు కాక సిసలైన తెలుగు పిల్లలు పుడతారా? కాన్వెంటులే తప్ప కళల బడులు కరవు. బూతు మాటలూ సినిమా మాటలే తప్ప తేట తెనుగు వినపడదు తీయగా. సినిమాల్లో తెలుగుతనమూ అంటే ... తమిళవు మద్రాసులోనో, ఉర్దూ హైదరాబాదులోనో కూర్చుని ఇంగ్లీషు నుంచీ, ఇతర భాషల నుంచి సంగ్రహించిన దొంగ సొమ్ములూ అరువు సొమ్ములూ!

కన్నతల్లినీ, ఉన్న ఊరినీ చూసి తనివి తీర్చుకుందామని తహతహలాడుతూ వచ్చాను తెలుగు సీమకి. కాని, ఆ అమ్మ మా అమ్మ ... తెలుగమ్మ ఎక్కడికో వెళ్లిపోయింది. స్వంత బిడ్డలే పంపేశారేమో! తెలుగమ్మ వలసపోయిందో, ప్రవాసం వెళ్లిపోయిందో. ఇక్కడ నే నెరుగని కొత్త అమ్మ. తెలుగమ్మకు సవతి. మారుటి తల్లి! ఆ తల్లీ ... ఈ తెలుగు పిల్లలూ!

వీళ్లకి సంప్రదాయ మక్కర్లేదు. సంస్కృతి అక్కర్లేదు! తమ జాతి గొప్పతన మెరుగరు. ప్రత్యేకత నెరుగరు. తన ఇంటి పాలకూరను కానలేక పొరుగింటి పుల్లకూర కోసం అర్రులు చాచుతున్నారు.

తెలుగువారికి తెర తారలే వేలుపులైపోయారు. ఎన్నికలకయినా ఎందుకయినా సినిమా సంబంధముంటేనే విజయం. సినీ కామెర్ల రోగులైపోయారు. జనవాహిని - సినీలి నీడలలో గ్రహణం పట్టిపోయారు. అందుకే నా కిక్కడ ఊపిరి సలపలేదు. ఉక్కిరిబిక్కిరయిపోయింది.

నిజానికి ...

తెలుగు తల్లీ! నీకిప్పుడు మల్లెపూదండలూ అక్కర్లేదు! మంగళారతులూ అక్కర్లేదు. నీ కిప్పుడు సినీ మాలలే సరదాలు. చిత్రహారాలే మోజులు!

అందుకే -

మా తెలుగు తల్లికీ మల్లెపూదండా! మా కన్నతల్లికీ మంగళారతులూ! అంటూ మహోత్సాహంగా వేల మైళ్ల నుంచీ తీయని భ్రమలో వచ్చిన నేను

మా తెలుగు తల్లికి సినీ మాలదండా! అని దుఃఖించుకుంటూ వెనుదిరగవలసివస్తోంది."

"గుడ్ బై తెలుగు తల్లీ! గుడ్ బై ఫరెవర్!" అని కళ్లు తుడుచుకున్నాడు జయరామ్ విచిత్రమైన వేదనకు లోనై.

నేటి తెలుగు పాటలా వ్యర్థమూ, అర్థవిహీనమూ, అయిన చప్పుళ్లు చేస్తూ సాగిపోతోంది రైలు ... ముందుకి - తెలుగు సీమను వదలి దూరంగా. ★



## చైనా ప్రధానితో ఓ పత్రికా విలేఖరి

అయ్యా! మీరు సరిహద్దు దేశాలన్నిటితో తగాదా పెట్టుకున్నారు. టిబెట్ ఆక్రమించుకున్నారు, ఆఫ్ఘనిస్తాన్‌తో కత్తులు నూరుతున్నారు, రష్యాతో రుసరుస లాడుతున్నారు, పాతికేళ్ల క్రితం ఇండియాని కూడా ఓ చూపు చూసి తగ్గిపోయారు, మరి ఇప్పుడు ఇండియాతో మీరు తగాదా పెట్టుకోకపోవడానికి కారణం ఏమిటి?

చైనా ప్రధాని: అమ్మో! ఇంకేమైనా ఉందా? ఇండియాలో ప్రతి ఇంటికీ ఒక కవి ఉన్నారు - అన్నాడట.

సేకరణ: పుత్తూరు ఉమ [బళ్ళారి]



## పి.ఆర్.ఓ. అంటే ?

తమిళనాడు సామ్రాజ్ఞి శ్రీమతి జయలలిత గారి కొత్త పి.ఆర్.ఒ. మహా చురుకండోయ్! ఆయన గారు ఇటీవల 'ఇండియా టుడే' ఫొటోగ్రాఫర్ కెమెరా రీలు లాగేసుకున్నారట! చేసిన నేర మేమిటయ్యా అంటే, 'జయలలితగారు రుమాలుతో ముఖం తుడుచుకుంటుంటే ఫొటో తీస్తాడా వాడ్!' అన్నారట. మరి ఏం ఫొటో తీయాలి అంటే, ఆయనగారు ఖండితంగా 'చిరునవ్వులు చిందించేవి మాత్రమే' అన్నారట.

అయ్యో! మన ప్రధాని పి.వి. నరసింహారావుగారికి ఇలాంటి పి.ఆర్.ఓ. లేకపోయేనే! పాపం పి.వి.

